# చివరి మాట

'రాం'—ఒక మంచి మిత్రుడు. అంతకంటే మంచి భావుకుడు, రసజ్ఞుడు మేధావి, కవి, భావశాలిత్వమూ, కల్పనా చమత్కృతీ, అభివ్యక్త సంవిధానమూ— ఈ ధాతువులన్నీ రాంలో పుష్కలంగా వున్నాయి. తన నిరాడంబర భావనలనూ, కామనలనూ, సరికొత్తగా — అనవసర హంగామా పోజూ, ఎస్సంప్షనూ లేకుండా అతి నిర్మలంగా అభివ్యక్తం చేయగల తెలుగు కవులలో నిస్సంశయంగా రాంని చేర్చక తప్పదు బాహ్య జగత్తులోని వికృతాలనిగానీ, అంతరంగాంతరాళలోని ప్రవృత్తులనుగానీ, అతి సూటిగా సభ్యతగా, సులభంగా, సున్నితంగా చెప్పగలడు. విర్రవీగుతున్న కుహనా విలువలను గొంతెత్తి గదమాయించే ధైర్యం వీరి కవితల్లో సరికొత్తగా కన్పిస్తుంది.

ఇది అతని కవితా సంపుటికి ముందుమాట రాస్తూ—ఓ ప్రఖ్యాత కవి వెలిబుచ్చిన అభిప్రాయం.

తెలుగు నాట మెజారిటీ పీరికా కర్తలు తమ పేజీల్లో—లేని దాన్ని ఉల్లేఖించి, ఉన్నదానికి పరదా వేస్తారనే చేదు నిజం — రాం సంపుటి విషయంలో చెల్లదు. చాలా మంచి కవితలు ఊహల లోకాల్లో, అందని తీరాల్లో, అనుభవాల కతీతంగా, ఎరువు తెచ్చుకొన్న అభిప్రాయాల్లో విపరీత చమత్కారంతో, పదాల విన్యాసాలతో — అద్భుతాలు కావు! వాస్తవాలు జీవన అంత! ప్రవాహంలోని కెరటాలు తానేమి రాస్తున్నారో, ఏ స్థాయి జనం చదువుతారో, తెలిసిన కొద్దిమంది కవుల్లోనివాడు — మిత్రుడు రాం!

'ముందు మాట' రాసిన ప్రఖ్యాత కవి 'రాం'ని దీవిస్తూ రాసిన కవిత కంటే. రాం రాసినవే గొప్పగా వున్నాయి పెద్దవానికి చిన్నవాడు ఆశీస్సు లిచ్చినట్టుగా వుందా కవిత.

ఓనాడు—ఆర్థికంగా కలిగిన వత్తిడిని బట్టి రాం దగ్గరికెళ్ళేను ఆ సమయాని కతడు స్నానం చేస్తున్నాడు అతని శ్రీమతి కూర్చోమని చెప్పి వెళ్ళిపోయింది. టీపాయ్ ముందున్న చెయిర్‌లో కూర్చున్నాను టీపాయ్ మీద ఓ రాజకీయ వార పత్రిక ఆ నెల విజయచిత్రతో పాటు, రెండు ఉత్తరాలు ఉన్నాయి ఒకటి కార్డు నాచూపు అన్యమనస్కంగా, ఆకార్డ్‌పై స్టాంపుపై నిలిచింది 'ప్రఖ్యాత కవి' రాసిన ఉత్తరమది? కవుల ఉత్తరాలలో కూడా కవితాత్మ ఉంటుందట

ఉత్తరం అందుకొన్నాను.

ప్రియ రాం,

'మీరు యివ్వాల్సిన పైకం యింకా పంపలేదు. పుస్తకం అచ్చయ్యేక యిస్తానని మీరే అన్నారు. మనం అనుకొన్న రేటు ప్రకారం—మీ పేర అచ్చయిన నా గేయాలకు డబ్బు పంపగలరు. నమ్మండి నమ్మకపోండి గేయం రాయడం ఎంత తేలికో, దాన్ని పత్రికకు పంపడం అంత కష్టమైపోతూంది. అన్యథా భావించకండి. యింకా ఎవరికైనా గేయాలు కావాలంటే నాకు రాయండి.సంతకం గజిబిజిగావుంది.

—రాం వచ్చాక పిచ్చాపాటీ మాటల్లో ఓ అరగంట గడిపి, బయటపడ్డాను—నా అవసరాన్ని రాంతోఎలాచెప్పుకోను?తెలిసీ!

—రచన జాతశ్రీ